# ★ పాలపొంగు ★

“శ్రీ సురాప్”

“సల సల కాగి చల్లారినపాలు మళ్లీ పొంగుతాయా బావా!”

“సహజంగా పొంగకపోయినా పరిస్థితులు, పొంగేటట్లుగా, పరిణమిస్తే—”

“నువ్వెంత చెప్పు ఏ పరిస్థితులు ఎంతగా పరిణమించినా పాలు పొంగవు, సరికదా - విరిగిపోతాయి ఎందుకూ పనికిరాకుండా”

“నువ్వు అవిధంగా అనుకొని బాధపడితే ఏమిటి సుఖంచెప్పు, లక్ష్మి”

“నేనెంత బాధపడినా, ఎంత విలపించినా ఎంతగా ప్రాధేయపడినా, ఫలితం మాత్రము శూన్యమే అంటావా! ఏదో తెలియనిబాధ నాలో ప్రవేశించి కలవరపెడుతోంది మోహన్.”

“సహజమే.”

“అంతేనా.”

“నన్ను ఏమిచెయ్యమన్నావు చెప్పు లక్ష్మి నేను తండ్రిచాటు వాడినికదా. చదువుకోనమని యిక్కడికి పంపేరు నన్ను చిన్నప్పటినుంచి మనం యిద్దరం కలిసి మెలిసి ఉంటున్నాం. యిప్పుడు నీ బలవంతం మీద ఏవిధమైన ద్రోహమేనా చేసేనా, చిన్నతనంనుంచి కన్నబిడ్డలాచూచి పెంచిన మేనమామకు, వంశానికి తీరనికళంకం సంపాదించిన వాడినవుతాను. తల్లిలేని నన్ను పెంచి పెద్దవాడినిచేసి, విద్యాబుద్ధులు గరిపినందుకు నీ తండ్రికి నేను చూపవలసిన కృతజ్ఞత యిదేనా”

“అయితే నాజీవితం యిక యీవిధంగా చల్లారవలసిందేనా? నీకిచ్చి వివాహంచేసినా యీ బాధలుండేవి కావేమో!”

“వెఱ్ఱిదానా! నీనొసట ఈవిధంగా విధాత వ్రాసిపెడితే, నన్ను వివాహంచేసుకున్నా యీ విధంగానే జరిగేదేమో? కర్మ అనుభవించక తప్పుతుందా?”

“అట్లా అనకు మోహన్,”

“నీకు యీవిధంగా జరిగేయోగం, నాకు యింకా అయుపు ఉంది కనుకనే మన యిద్దరికి వివాహం జరగలేదు,”

“బావా! నీవు వీరేశలింగంగారి వితంతు వివాహపద్ధతిని గురించి ఎంతో అభినందించే వాడవుకదా. నీవుకూడ ఒక సంస్కర్తనని రొమ్ము విరుచుకొని తిరుగుతావే బజారుల్లో. యిదేనా, ఒక బాలవితంతు, మేనమామ కూతురు. చిన్నతనంనుంచీ ఒక కంచంలో తిని తిరిగిన స్త్రీని వివాహం చేసుకోడానికి ధైర్యం లేదా? అంత రాతిహృదయమా మోహన్ నీది.”

“లక్ష్మి! నన్ను అర్థంచేసుకోలేక, నీబాధ భరించలేక యిష్టంవచ్చినట్లు మాటలాడుతున్నావు కాని, నిన్ను నేను బాగా ఎరుగుదును. పెండ్లి అయిన నెలరోజులకే ఏవిధమైన సంసారసుఖాన్ని అనుభవించకుండానే పరలోకానికి పోయేడు నీభర్త. నువ్వు శీలవతివి నాకు తెలుసు కానీ, వంశ మర్యాదలకోసం, ప్రపంచకానికి, లోకులకి భయపడి సాహసించలేకపోతున్నాను.”

“బావా! లోకులకు భయపడవలసిన అవసరంలేదు, లోకులకి పనేముంది, ఎవళ్లేనా తప్పులు చేస్తున్నారా అనే అన్వేషణ తప్ప. వారుచేసే తప్పులతోవాళ్ళకి సంబంధంలేదు. పురుషుడు ఎన్నిసార్లేనా ఎంతమంది నయినా వివాహం చేసుకోవచ్చునట! కాటికికాళ్లు చాచుకొని కూర్చున్న ముదుసలికూడ పెండ్లి అంటే లేచికూర్చుంటాడు నెరసిన మీసాలు దువ్వుతూ! లోకులు యిటువంటివారిని, వారు చేసే దురాచారాలని మెచ్చుకుంటుంది కాని ముక్కు పచ్చలారని స్త్రీ, భర్తపోతే తిరిగి వివాహం చేసుకోకూడదు ఆహా! లోకులు, లోకులట! లోకులు!!”

“నువ్వు చెప్పినది నిజమే లక్ష్మి! కాదనను కాని లోకుల నోళ్ళు ముయ్యడానికి మూకుడుందా! లోకాన్ని, లోకాచారాలిని లోకుల అపవాదులను, లెఖ్కచెయ్యకుండా అన్నిటికి తెగించి తిరిగేవాళ్ళని ఎవ్వరూ ఏమీ చెయ్యలేరు. కాని నాకు ఆవిధంగా సంచరించడానికి ధైర్యం చాలడంలేదు.”

“అహా! పురుష హృదయం”,

“లక్ష్మి! నీకష్టాన్ని, నీవుపొందే తాపాన్ని భరించలేక అవిధంగా మాట్లాడుతున్నావు గాని ముందు ముందు అనుభవించవలసిన కష్టాలని తెలుసుకోలేకపోతున్నావు. బంధువులు మనల్ని దూరంచేస్తారు, నీచభావంతో చూస్తారు. మిత్రులలోకూడ కొంతమంది అభినందిస్తారు, కొందరు నిందిస్తారు. నువ్వనుకున్నంతగా ప్రపంచకము యింకా మారలేదు”

“మారలేదు కనుకనే నిన్ను యింతగా వేడవలసివస్తోంది”

“అంత కోపం ఎందుకు? పోనీ, మామయ్యతోచెప్పి ఒప్పించు, నా అభ్యంతరంలేదు”

“మా నాన్నగార్ని ఒప్పించే సమర్థత ఉంటే ఈబాధలన్నీ దేనికి అయినా నువ్వు ఒప్పించు, నీ బి ఎ. తెలివితేటలుచూద్దాం!”,

“...............”

“ఏమిటి దీర్ఘంగా ఆలోచిస్తున్నావు.”

“ఏముంది. ఈ సమస్య ఏవిధంగా పరిష్కరించడమా? అని.”

“బి. ఎ. ఒకపార్టు ఉండిపోయింది. అది కూడ పాస్ అయివుంటేనా, ఈసమస్య చాల సులభంగాతేల్చగలిగేవాడవు”

“చాల్లే! వేళాకోళాలకి సమయంకాదని తెలుసుకో.”

ఆ! తెలుసుకున్నాను, లేకపోతే ఏమిటి బావా, యీపాటి దానికి ఆలోచన? ధైర్యం ప్రధానం”

“ఏం చేద్దామంటావు”

“రింగు రంగాయని రాత్రి బండెక్కి ఏ కలకత్తాయోపోయి అక్కడ ఏదైనా ఉద్యోగం చేసుకుంటూ కాలక్షేపం చేసుకుందాము. అక్కడ మనమిద్దరం భార్యా భర్తలమని నమ్మనివాడుంటాడా? ఈ పాటిదానికి అంత ఆలోచనా? నీవు నిజంగా భగవంతుని ముఖంచూచి, గుండె పై చేయి వేసుకొని, నన్ను ప్రేమిస్తున్నానని, పరిస్తితులు ఎంత విషమించినా నన్ను వివాహం చేసుకుంటా నని ప్రమాణము చెయ్యి’

“ఉ; ఆలొచించకు, చెయ్యి ప్రమాణం చెయ్యిముందు”

"లక్ష్మీ! నేను చెప్పేదివిను, బాగా ఆలోచించి చెబుతున్నాను"

"ముందు ప్రమాణంచేసి తరువాతచెప్పు"

"ముందు చెప్పేది విను"

"… …. . ………"

"నే భగవంతుని సాక్షిగా, తప్పక నిన్ను వివాహంచేసుకుంటాను, ఎట్టి విషమ పరిస్థితులు ఏర్పడినా వాటిని ధైర్యంతో ఎదుర్కొంటాను, అని ప్రమాణం చేస్తున్నాను. యింక నీవు ఈ విషయం బెంగపెట్టుకొని నీ ఆరోగ్యాన్ని పాడు చేసుకోకు. నా తండ్రి నన్ను తన దగ్గర నుండి దూరంచేసి నా ఆస్తి పాస్తులు యివ్వక పోయినా, నారెక్కల కష్టం మీద నిన్ను పోషిస్తాను"

"బావా"

'లక్ష్మి"

"ఈలతకి నీరు పోసి పెంచే భారం నీది"

"తప్పకుండా. ముమ్మాటికి నిన్ను భార్యగా స్వీకరిస్తాను."

• • •

"బావా! ఆర్డరు వచ్చింది కదా, ఎప్పుడు చేరాలి డ్యూటీలో."

"వచ్చే సోమవారం బయలుదేరివెళ్ళి బుధవారంచేరాలి. మరి నువ్వు సిద్ధమేగా."

"ఓ!! రెడీ."

"అబ్బ! ఎంతహుషారు. యింతకంటె ఎక్కువ హుషారుగా ఉంటావను కుంటాను అప్పుడు."

"అహా! కాక."

"మామయ్యతో చెప్పాను. చాల సంతోషించాడు. అభివృద్ధిలోకి రమ్మని ఆశీర్వదించాడు."

బావా! మరి నేను నీతోటివస్తే మానాన్న, నేను యింటిదగ్గిర లేకపోవటంచూచి కలకత్తా వస్తాడేమో, నేను నీతోటివచ్చి ఉంటాను కదా అని."

"ఆ! అవును, ఎట్లా."

'…………………"

"అరే! అట్లా నవ్వుతా వెందుకు ముందీ సమస్య సాల్వుచెయ్యక,'

"ఓ బి.ఎ. బావా! ఆలోచించు పోయి"

"ఏమో!"

"ఏమి టంటే'

"చప్పున చెప్పదు. నవ్వక"

"తొందరేల నోయీ! ఓ బి.ఎ. బావా,,

"అసలు సంగతి చెప్ప మంటే"

"ఉండండీ చెప్పే దాకా"

"ఓ యబ్బో! అప్పుడే" అందీ "అంటున్నావే"

"…………………"

'ఓస్ ఎంత సిగ్గు!"

"…………………"

"చెప్పు త్వరగా"

"మానాన్న గారితో, కలకత్తా బావతో వెళ్లి మళ్లీ నాలుగు రోజులలో వస్తానండి అన్నాను. ఒక్క దానవు ఎట్లా రాగలవు తల్లీ అన్నారు. బావ అక్కడ మెయిలు ఎక్కిస్తాడు, యిక్కడ దిగుతాను అని అన్నాను. సరే నని ఒప్పుకున్నారు, కాబట్టి స్వేచ్ఛగా, ధైర్యంగా వెళ్ల వచ్చు"

"సెహబాష్"

"…………………"

"మంచి ఎత్తు వేశావు గాని, నువ్వు తిరిగి నాలుగు రోజుల్లో రాక పోతే ఆయన వస్తారేమో"

"వస్తేరాని! మనం కలకత్తాలో ఉంటేగా? మనం వెళ్లేది కటక్ గదా! అందరితో చెప్పేది కలకత్తా అని"

"హ! హ్హ! జ్ఞాపకం ఉంది"

"హ! హ్హ! హ్హ!"

'బావా! నువ్వు మంచి తెలివితేటలుగా తప్పించు కుంటావే పరీక్ష ఎట్లాపోయింది? '

"అనుమానం పరీక్షపోయింది. పోయిందంటావు. జాగ్రత్త! వచ్చే సెప్టెంబరులో పూర్తి చెయ్యగలను."

"తథాస్తు,"

"సరే! పోయి బట్టలు వగైరా సర్దుకో."

"వెళ్ళివస్తాను! జగన్మోహనా!'

"ఓ! మంచిది, భీత హరిణేక్షణా."

• • •

"బావా! మనం కటక్‌లో దిగిపోతాంగదా పాపం మానాన్నగారు నాకోసం కలకత్తా వెదకుతారేమో."

"మనకేం"

"…………………"

"అయితే బావా! కాగి చల్లారిన పాలు మరల పొంగుతాయా."

"సహజంగా పొంగకపోయినా పరిస్థితుల పరిణామాన్ని బట్టి పొంగుతాయి, తప్పక పొంగుతాయి, లక్ష్మి."

# స్వతంత్రప్రబోధం

వినవచ్చె నల్లదిగో విజయ ఢంకా
వేగమే లేవంగ వేళాయరా
శాంతి సమరముయొక్క సారమిదిరా
ఉడుకు రక్తపునదుల నాథమిదిరా
పీటితో - శృంఖలాల్ తెగిపోయెరా॥ వి॥
దైన్యవదనాలింక ధైర్యమును చెందురా
స్వాతంత్ర్య సమ్మిళిత సౌధమ్ములో
ధీరులకు పేదలకు తావేదిరా॥ వి॥
నవయుగపు చారిత్ర గ్రంథమ్ము వ్రాయంగ
శ్రీకారమేనేడు చుట్టామురా
సృష్టికే శృంగార మిస్తుందిరా॥ వి॥
నీసత్య సత్వమ్ములో కాల మ్రోగెరా
ఐకమత్యపులోప మొండేరా
అదికూడ నేటితో మాయింపరా॥ వి॥
స్వాతంత్ర్య పౌరుని స్వామ్యమ్ము లెవ్వియో
ఊహించి నేర్చుకొని సాధింపరా
ఉత్తముల పంథాల సాగిపోరా॥ వి॥

"సత్యం"